


పర్యావరణహితంగా వినాయక చవితి


జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణేష్ పోస్టర్‌ను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పేస్ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, సభ్యులు రామాయణం సతీష్, జడ్డు ప్రసాద్, వీరవల్లి మధు, జడ్డు సాత్విక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి


భీమవరంలో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు


ఆచంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని చుట్టుముట్టిన వర్షపు నీరు

వర్షం.. కష్టం..!

అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం

ఏలూరు జిల్లాలో 41.4 మిల్లీమీటర్లు, 'పశ్చిమ'లో 96.2 మిల్లీమీటర్లు సరాసరి వర్షపాతం

రెండు జిల్లాల్లో 90 శాతం నాట్లు పూర్తి

అన్నదాతకు ముంపు భయం

నూజివీడులో పెద్దచెరువుకు గండి: పరిసర ప్రాంతాలు, పంటలు మునక

జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

చెరువులకు గండ్లు, రోడ్లు జలమయం. ముంపు అంచున పంట పొలాలు, బిక్కుబిక్కుమంటూ జనం. అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. అల్పపీడన ప్రభావంతో శనివారం రెండు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అప్రమత్తమైన అధికారులు ముందుగానే స్కూళ్లకు సెలవు ప్రకటించారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. మరో రెండురోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పడంతో జనంలో భయాందోళనలు నెలకొన్నాయి.


ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షంతో రెండు జిల్లాల్లో జన జీవనం స్తంభించింది. పంట ముంపు భయం రైతులను వెంటాడుతోంది. శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఏలూరు జిల్లాలో 41.4 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. ముసునూరు మండలంలో అత్యధికంగా 126.4 మిల్లీమీటర్లు, లింగపాలెంలో 94.4, నూజివీడులో 88.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరిన 96.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా పాలకొల్లులో 199.4 మిల్లీమీటర్లు, పెనుమంట్రలో 131 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఏలూరులోని పవర్‌పేటలో రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచింది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వర్షపు నీరు చేరడంతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. నూజివీడులో పెదచెరువుకు గండిపడి పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. 450 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో తేలింది. నూజివీడు బస్టాండ్ నీట మునిగింది. నూజివీడు-విస్సన్నపేట, నూజివీడు-హనుమాన్ జంక్షన్ రోడ్లు నీటమునిగాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. జలాశయాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, వైర్లు తెగిపడితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో జనం ఇంటికే పరిమితమయ్యారు. ఏజెన్సీ మండలాల్లో ఇప్పటి వరకూ ఇబ్బంది లేదని చెబుతున్నారు. ఇదే విధంగా వర్షాలు కొనసాగితే గోదావరికి వరద వచ్చే ప్రమాదం ఉందని ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జులైలో ముంచెత్తిన వరదలకు పునరావాస కేంద్రాలకు చేరిన నిర్వాసిత ప్రజలు కొద్దిరోజుల క్రితమే తమ గ్రామాలకు చేరుకున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతను వెంటాడుతున్న ముంపు భయం

ఏలూరు జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో లక్షా 90 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా ఇప్పటి వరకూ లక్షా 60 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. పశ్చిమలో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఇప్పటి వరకూ లక్షా 90 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. రెండు జిల్లాల్లో దాదాపు 90 శాతం నాట్లు పూర్తికాగా, మరో పదిశాతం నారుమడుల దశలో ఉన్నాయి. జులైలో కురిసిన వర్షాలకు నాట్లు నాటిన పొలాలు, నారుమడులు మునిగి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇప్పుడో మరోసారి భారీవర్షాలు పడుతుండటంతో పంట పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని, లేకపోతే పంటపొలాల్లో వర్షపు నీరు కిందకు పారే అవకాశం లేకుండా పోతుందని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులను అప్రతమత్తం చేసి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందీ లేదని రెండు జిల్లాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఉద్యాన పంటలకు ఇప్పటి వరకూ ఇబ్బంది లేదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు.


జీలుగుమిల్లిలో మిరప నారుమడిలో వర్షపు నీరు


నూజివీడు బస్టాండ్ లోపల వర్షపు నీరు

స్తంభించిన జనజీవనం..

ప్రజాశక్తి - భీమవరం టౌన్


పాలకొల్లు : జలమయమైన రహదారి

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే వర్షం రాత్రి, శనివారం కూడా భారీగా కురవడంతో జనం గడప దాటి బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు నూతన ప్రాంతాలకు పెద్ద ఎత్తున వచ్చి చేరడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా భీమవరం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్, గునుపూడి, అరుంధతి పేట వంటి ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. నీటిని తరలింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ఇబ్బంది వల్ల రోజు వారి కూలీలు, పాడి రైతులు, పశువులకు దాన సమకూర్చడం వారికి కష్టతరంగా మారిందని పాడి రైతులు చెబుతున్నారు.

గడచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల వ్యవధిలో 1923 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు శనివారం తెలిపారు. జిల్లాలో అత్యధికంగా పాలకొల్లు మండలంలో 199.4, నరసాపురం 131.4, పెనుమంట్ర 110.4, భీమవరం 105.6, యలమంచిలి 102.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదు కాగా జిల్లాలో అత్యల్పంగా తణుకు మండలంలో 60.4, పెంటపాడు మండలంలో 63.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. జిల్లాలో సగటు వర్షపాతం 96.2 మిల్లీ మీటర్లుగా నమోదైంది.

ఆచంట: శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు మండలంలో సుమారు 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఆయా గ్రామాల్లోని పక్కా, కచ్చా డ్రెయిన్‌లలోని మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. ఆచంట చిన్నపేట, పెద్దపేట, కొడమంచిలి టీ మెరక, ఆచంట వేమవరం పసలపేట, వల్లూరు శివారు మాదాసివారిపాలెం, కరుగోరుమిల్లి పంచాయతీ కాలనీ, తదితర కాలనీలో నీరు నిలిచిపోయింది. ఆయా కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, మురుగునీరు బయటకు పోయే మార్గం లేక పారిశుధ్యం మరింత క్షీణించింది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆచంట చిన్నపేటలో మురుగు డ్రెయిన్ పూడుకు పోవడంతో స్థానికులు ఆ డ్రెయిన్‌లోని చెత్తాచెదారాన్ని తొలగించుకున్నారు.

ఆచంటలోని చిన్నపేటలో అంగన్వాడీ సెంటర్ ఆవరణం వర్షం నీటితో నిండింది. కొడమంచిలి ఆర్ అండ్ బి రహదారిలో కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు మరింత దిగజారాయి. ఎడతెరిపిలేని వర్షం చిరు వ్యాపారులను దెబ్బతీసింది. ఆచంట, కొడమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో ముంపు బారిన పడిన పలు కాలనీలో మురుగునీటిని బయటకు పంపేందుకు ఆయా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొగల్తూరు : మొగల్తూరులోని మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహశీల్దార్ సిహెచ్.విద్యాపతి తెలిపారు. అధిక వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 9291539408 కు ఫోన్ చేసి సమాచారం అందించవలసిందిగా ఆయన సూచించారు.

మొగల్తూరులోని శివాలయం వీధి, హై స్కూల్ వీధి, ముక్కువారి వీధి, సత్తమ్మ గుడి వీధి, పడమటి పాలెం, గొల్లగూడెం, కెపిపాలెం, పేరుపాలెం తదితర గ్రామాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు బయటకు వెళ్లాలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో పాలకొల్లులో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం దంచికొట్టింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లు, డ్రెయిన్‌లు ఏకమై ప్రవహిస్తున్నాయి. అత్యధికంగా పాలకొల్లులో 199.4 మిమీ వర్షపాతం నమోదైంది. అయినా వర్షంలో పారిశుధ్య పనివారు పనిచేయడంతో పలువురు అభినందిస్తున్నారు.

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నరసాపురం పట్టణంలో కురుస్తున్న వర్షాలకు శనివారం 2వ వార్డు మాధవాయిపాలెం, 15వ వార్డ్ పీచుపాలెంలో పలు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వర్షం నీటితో వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉండి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జాతీయ రహదారి 165లో ఉన్న ఉండి గ్రామంలోని రహదారి పూర్తిగా ఛిద్రం అవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గోతులలోకి నీరు వెళ్లి కనిపించకపోవడంతో కొంతమంది గాయాలపాలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఈ రహదారుల వైపు దృష్టిసారిస్తే రహదారులు పునర్నిర్మాణం జరిగే అవకాశం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షం వీడకపోవడంతో చేతివృత్తిదారులు, చిరు వ్యాపారస్తులు వ్యాపారాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం కలెక్టర్ నాగరాణి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు అందరూ కూడా వారి ప్రధాన కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా 08816-299219 ఫోన్ నెంబర్‌తో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలైన పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కావలసిన భోజనం, మంచినీరు సదుపాయాలను కల్పించాలన్నారు. అవసరమైనచోట మెడికల్ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్, ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలను అందించాలన్నారు. మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలి : ఎఇ

నరసాపురం: జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బందిని నరసాపురం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ శనివారం అప్రమత్తం చేశారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. తెగిపడిన విద్యుత్ వైర్లు, స్తంభాలు, చెట్ల కొమ్మలను తాకవద్దని విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకు రబ్బరు చెప్పులను ధరించడం శ్రేయస్కరం. వ్యక్తిగత భద్రత ముఖ్యమని, అన్నింటి కన్నా ప్రాణం మరింత ముఖ్యమైనదన్నారు. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సెక్షన్ ఆఫీసర్ నంబర్ 7382050943, టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని కోరారు.

పేదల కళ్లలో ఆనందమే చంద్రబాబు లక్ష్యం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల

పేదల కళ్లలో ఆనందం చూడటం కోసమే ప్రతినెలా ఒకటో తేదీన పేదల దినోత్సవంగా నిర్వహిస్తూ, వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఒకటో తేదీ సెలవుదినం కావడంతో ఈసారి ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మండలంలోని పెదఅమిరం ఎస్‌సి కాలనీలో వర్షంలో సైతం గొడుగులతో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. వృద్ధాప్యంతో మంచం దిగలేని పరిస్థితిలో గుడిసెలో ఉన్న కరిపల్లి వెంకటేశ్వరరావు వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసి, వారి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎస్‌సి కాలనీవాసులతో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఏసమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు ఇబ్బంది పడకూడదని సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, ఎపిఒ పెన్షన్స్ టి.మురళీకృష్ణ, ఎంపిడిఒ జి.స్వాతి, సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఆర్‌ఐ జి.లక్ష్మికిరణ్, సెక్రటరీ పి.కనకారావు, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పెదఅమిరంలో పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్

ప్రజలపై భారాలు సరికాదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టి ప్రజలపై భారాలు వేయడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం రెండోరోజు కొనసాగింది. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలో ఉన్నంత కాలం అదానీ, అంబానీలే అభివృద్ధి చెందుతారని అన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఆందోళనకరమన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చినా ప్రజలపై భారాలను తగ్గించే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై వేసిన భారాల వల్లే అధికారం కోల్పోయిందని గుర్తుచేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధిక ధరల భారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కూరగాయలు, నిత్యావసరాల ధరల నియంత్రణ, నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాలో ప్రజా సమస్యలపై జిల్లా కార్యదర్శి బి.బలరాం పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

జిల్లా పౌర సరఫరాల అధికారి సరోజ

భీమవరం: జిల్లాలో సెప్టెంబర్ నెలకు సంబంధించిన రేషన్ ఆదివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 5,67,651 బియ్యం కార్డు లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. సెప్టెంబర్‌కు సంబంధించి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ సెప్టెంబర్ 17వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని బియ్యం కార్డుదారులంతా దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

మలమల..సలసల..!

వారంతా భావి భారత పౌరులు.. విజ్ఞాన సముపార్జనే లక్ష్యంగా అక్కడకు చేరుకున్నారు.. అయితే అన్నార్తుల్లా ఆకలి మంటలతో మలమల్లాడుతూ, మరోపక్క అపరిశుభ్ర వాతావరణం.. కలుషిత ఆహారంతో అనారోగ్యం పాలై విలవిల్లాడుతున్నారు. ఇదీ రెండు జిల్లాల్లో ప్రతిష్టాత్మకమైన నూజివీడు ట్రిపుల్ ఐటితోపాటు పలు విద్యాసంస్థలు, హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితి. అదే సమయంలో జిల్లావ్యాప్తంగా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అన్నిచోట్లా జనం జ్వరాలతో మూలుగుతున్నారు. ఆసుపత్రులకు వెళ్లినా సలసలలాడే జ్వరం తగ్గక తల్లడిల్లుతున్నారు. ఇదే సమయంలో డెంగీ మరణాలు జనాలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

రెండు జిల్లాల్లో గ్రామీణ, పట్టణప్రాంతాల్లో రోగాలు విజృంభిస్తున్నాయి. జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలు, కీళ్లనొప్పులు వంటి సమస్యలతో జనం ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. చికిత్స పొందినా వీటి ప్రభావం కనీసం వారం నుంచి పది రోజులకుపైనే ఉంటోంది. దీంతో ఆరోగ్య, ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. డెంగీ కేసులు అధికారికంగా నమోదు చేయడానికి, చూపడానికి వైద్యారోగ్య శాఖాధికారులు ఇష్టపడటం లేదు. దీంతో జనం సమీప పట్టణాల్లోని ప్రయివేటు ఆస్పత్రులకే వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఏజెన్సీ, మెట్ట, డెల్టా ప్రాంతాల్లో డెంగీ మరణాలు చోటుచేసుకోవడం అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం మాత్రం జ్వరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా ఆచరణలో అటువంటి దాఖలాలేవీ కానరావడం లేదు. పైగా అపరిశుభ్యం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం తదితర సమస్యలు జనాలను పట్టిపీడిస్తున్నాయి. తక్షణం ప్రభుత్వం రెండు జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి గ్రామీణప్రాంతాల్లో విరివిగా వైద్యశిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాలబారిన పడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడితే పరిస్థితి ఎంతోకొంత మెరుగుపడే అవకాశం ఉంది. అలాకాకుండా గత ప్రభుత్వ వైఫల్య ఫలితమేనని విమర్శలు చేస్తూ కూర్చుంటే గత పాలకులకు, ప్రస్తుత పాలకులకు తేడా లేకుండా పోతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక నూజివీడు ట్రిపుల్ ఐటిలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర ప్రజారోగ్య శాఖాధికారులు పర్యటించి హెచ్చరించినా మెస్‌ల నిర్వహణలో మార్పు రాకపోవడం వ్యవస్థీకృతంగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. అన్నివైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ సెలవుపై వెళ్లిపోయారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శుక్రవారం రాత్రి వరకూ ట్రిపుల్‌ఐటి ప్రాంగణంలో ప్రత్యక్ష చర్యలకు దిగడం విద్యార్థులకు కొంత ఉపశమనాన్నిచ్చింది. కార్యాచరణలో రానున్న రోజుల్లో మెస్‌ల నిర్వహణ మెరుగ్గా సాగితే విద్యార్థులకు అర్ధాకలి, అనారోగ్యం దూరమవుతాయి. అలాగే జిల్లాలోని అన్ని గురుకుల, ఆశ్రమ పాఠశాలలతోపాటు హాస్టళ్లన్నిటిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై తక్షణం హెల్త్ చెకప్‌లు నిర్వహించాలి. అవసరమైన మందులు అన్ని వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర నెలలు దాటింది. గత వైసిపి ప్రభుత్వంలో వివిధ పదవులు చేపట్టిన వారు పక్కచూపులు చూస్తున్నారు. వైసిపి అధినాయకత్వంపై అపనమ్మకమో.. లేక తమ పదవీకాలంలో చేపట్టిన పనులపై ఎటువంటి చర్యలుంటాయోననే ఆందోళనో చాలామంది నేతలు మౌనంగా ఉంటున్నారు. మరి కొందరైతే అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల నాని, ఏలూరు మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, వైసిపి ఏలూరు నగరాధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఇడా ఛైర్‌పర్సన్ బొద్దాని అఖిల, మాజీ ఎఎంసి ఛైర్మన్ మంచెం మైబాబు తదితరులు వైసిపికి గుడ్‌బై చెప్పారు. ఆప్తై నాని తప్ప మిగిలిన వారంతా నారా లోకేష్ సమక్షంలో టిడిపి గూటికి చేరారు. మరి నాని రూటెటో వేచిచూడాలి. ఇదేరీతిన రెండు జిల్లాల్లో కొంతమంది వైసిపి నేతలు పక్కచూపులు చూస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ముఖ్య నేతలెవ్వరూ పార్టీ దిగువ శ్రేణుల నేతల్లో ఆత్మస్థైర్యం నింపే పని చేయకపోవడంతో ఆ పార్టీ మండలస్థాయి నేతలు, కార్యకర్తలు సైతం తీవ్ర గందరగోళంలో ఉన్నారు. పాలకొల్లు మినహా మిగతా ఎక్కడా వైసిపి నేతలు యాక్టివ్‌గా కన్పించడం లేదు. ఎంఎల్‌సిలు రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం అప్పుడప్పుడు అధికారిక సమావేశాల వంటి వాటిలోనే కన్పిస్తున్నారు. మొత్తానికి గత ఎన్నికల ముందు వరకూ సందడి చేసిన వైసిపి అధికారం కోల్పోయాక పూర్తిగా నిస్తేజమైపోయిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

'ప్రజల ఆర్థిక భద్రత జీవిత బీమా'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ ప్రజలకు ఆర్థిక భద్రత, ప్రభుత్వాలకు లక్షల, కోట్ల రూపాయల పెట్టుబడులు అందిస్తూ ప్రభుత్వ రంగ అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత బీమా సంస్థ అభివృద్ధి చెందిందని బీమా ఉద్యోగుల సంఘ నాయకులు గరికపాటి బాపయ్య శర్మ పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న బీమా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 68 సంవత్సరాలుగా జాతి, జనుల సేవలో అగ్రభాగాన ఎల్ఐసి నిలిచిందన్నారు. 1956లో రూ.5 కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఎల్ఐసి నేడు 52 లక్షల కోట్ల ఆస్తులతో ప్రపంచస్థాయి బీమా సంస్థగా, 40 కోట్ల పాలసీదారులకు కొంగు బంగారంగా సేవలు అందిస్తోందన్నారు. బీమా ప్రీమియంపై జిఎస్టిని తొలగించాలని, ఎల్ఐసిని మరింత పటిష్టంగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ ఎల్ఐసిని మరింతగా ప్రోత్సహించాలన్నారు.

నాగరాజుకు పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మాజీ జెడ్పిటిసి సభ్యులు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు శనివారం పరామర్శించారు. నాగరాజు తండ్రి సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నాగరాజును పరామర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట పాల రాంబాబు, నాగళ్ల నాగు, బొల్లా చంటి, సంకు భాస్కర్ నాయుడు ఉన్నారు.

గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ అదృష్టం

జిల్లా వైద్యశాఖ అధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని, గౌరవ ప్రదంగా ఉద్యోగవిరమణ చేయడం అదృష్టమని జిల్లా వైద్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జాతీయ కుష్టి నిర్మూలనా కార్యక్రమంలో వివిధ హోదాలలో 40 ఏళ్లగా పనిచేసిన పారా మెడికల్ అధికారి గంటా ప్రతాప్ కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్గా 38 ఏళ్ల పనిచేసిన కె.శ్రీనివాసరావుల ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగవిరమణ పొందుతున్న గంటాప్రతాప్ కుమార్, కె.శ్రీనివాసరావు దంపతులను, జిల్లా సహాయ వైద్య శాఖ అధికారి భాను నాయక్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. జిల్లా సహాయ వైద్య శాఖ అధికారి భాను నాయక్, డాక్టర్ ధనలక్ష్మి, గణాంక అధికారి ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఏఇఒ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణ మండప అభివృద్ధికి హామీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు బ్రాడీపేటలో తూర్పు కాపుల కళ్యాణమండప అభివృద్ధికి సంబంధించి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. మంత్రి శనివారం కళ్యాణ మండపాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడి కమిటీ యువకులు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా మంత్రి సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని కోరగా మంత్రి తక్షణం ఏర్పాటు చేయాలంటూ మున్సిపల్ కమిషనర్కు ఆదేశాలు ఇచ్చారు. కమిటీ సభ్యులు మంత్రి అభినందించారు.

జిల్లాకు ప్రత్యేక అధికారి నియామకం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. వ్యవసాయశాఖ కార్యదర్శి ఎ.బాబును నియమించారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 26 జిల్లాలకు 26 మంది అధికారులను నియమించగా బాబును పశ్చిమగోదావరికి కేటాయించారు. సంబంధిత హెచ్ఒడి కేడెలను, ఆయా జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలును పర్యవేక్షణ చేయవలసి ఉంటుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సంక్షేమం ఘనత ఎన్టిఆర్

మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్షేమ పథకాలను రాష్ట్రంలోనే కాకుండా దేశానికే పరిచయం చేసిన ఘనత ఎన్టిఆర్దని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక బ్రాడీపేటలో ఎన్టిఆర్ విగ్రహాన్ని శనివారం మంత్రి ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్టిఆర్ అంటే స్ఫూర్తి అని, అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని అభివర్ణించారు. మహోన్నతుల విగ్రహం ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలను మంత్రి తెలిపారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నడి వీధుల్లో కాదు, ప్రపంచానికి చాటిచెప్పిన మహా పురుషుడు ఎన్టిఆర్ అని మంత్రి కొనియాడారు. ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు, పథకాలు అమలుచేసి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సంక్షేమానికి పాటుపడిన వ్యక్తి ఎన్టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జివి, పెచ్చేటి బాబు, ఐత్తంపూడి కుమార్, పోట్నూరి శ్రీనివాస్, ధనని ప్రకాష్, సుబ్బారావు, రమేష్, కుక్కల మేరీ కుమారి, దేవరాసుల వరలక్ష్మి, మైగాపుల పద్మజ, కొలను అనసూర్య పాల్గొన్నారు.

తోటివారిపట్ల సోదరభావం ఉండాలి : రేవు కార్తీక్

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించి తోటివారిపట్ల సోదర భావం కలిగి ఉండాలని ఉండి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. శనివారం సాయంత్రం ఉండి మండలం అర్తమూరు గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేవు కార్తీక్ మాట్లాడుతూ దళితుల పట్ల వివక్షత చూపకుండా ప్రతి ఒక్కరిని తమతో సమానంగా చూడాలని ఆయన అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం అందరికీ కల్పించిన హక్కు అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి గ్రామ రెవెన్యూ అధికారి పైడాల చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్కు మార్గదర్శకులు గురువులే

గురుపూజోత్సవ వేడుకల బ్రోచర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పిల్లల ఉజ్వల భవిష్యత్కు మార్గదర్శకులు గురువులేనని, గురువు లేని వ్యవస్థ కానరాదని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో జరగనున్న గురుపూజోత్సవ (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకల బ్రోచర్ను ఎంఎల్ఎ అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మహోపాధ్యాయులుగా రాష్ట్రపతి స్థాయికి చేరుకొని ఉపాధ్యాయులకే కాకుండా సమాజానికి గర్వకారణమని, ప్రతి అంశాన్ని భావితరాలకు తెలియజేయాలని వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు భీమవరం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఇన్నర్ వీల్క్లబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని, 1, 2, 3 తేదీల్లో విద్యార్థులకు పోటీలు, 4న ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా 24 మంది ఉపాధ్యాయులకు సత్కారం, 5న ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, ఆడబాల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎఎస్పిగా మురళీకృష్ణకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్పి ఎన్బిఎం.మురళీకృష్ణకు ప్రభుత్వం అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. మురళీకృష్ణ ఈనెల 28న నరసాపురం డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల్లోనే అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఈమేరకు ప్రభుత్వం ఆయనను మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

పేకాటరాయుళ్లు అరెస్టు

నరసాపురం: నరసాపురం పట్టణం మంగినవారి వీధిలోని ఓ భవనంలో నిర్వహిస్తున్న జూద కేంద్రంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసినట్లు పట్టణ ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు. 13 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.87 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జోరువానలో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లావ్యాప్తంగా శరవేగంగా పెన్షన్ల పంపిణీ నూరుశాతం పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండలంలోని వీరవాసరం సచివాలయం 1, 2 పరిధిలో ఎన్టిఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గుండా నాగరత్నం, పైడికొండల సత్యవతి, పైడికొండల వీరవేణిలకు రూ.4 వేలు చొప్పున, గుణ్ణం శ్రీవెంకటేశ్వర్లు వికలాంగుడికి రూ.6 వేలు పెన్షన్ను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. జిల్లాలో ఎక్కడెక్కడ పెన్షన్ల పంపిణీ నిదానంగా జరుగుతోందో అలాంటి చోట్ల పెన్షన్ల పంపిణీ వేగవంతంగా చేపట్టేలా సంబంధిత మండల ప్రత్యేక అధికారులు, డిఆర్డిఎ అధికారులు పర్యవేక్షణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం పెన్షన్ల పంపిణీ పూర్తిస్థాయిలో చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వీరవాసరం సచివాలయం-2 పరిధిలోని పైడికొండల సత్యవతి, పైడికొండల వీరవేణి అభయ హస్తం పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, పైడికొండల విజయలక్ష్మి కేన్సర్ వ్యాధిగ్రస్తురాలు మెడికల్ పెన్షన్ మంజూరు చేయాలని జెసిని కోరారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వీరవాసరం ఎంపిడిఒ టి.విజయ సారథి పాల్గొన్నారు.



వీరవాసరంలో పెన్షన్ల పంపిణీ పర్యవేక్షిస్తున్న జెసి

పెనుమంట్ర : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆశీస్సులతో మండలంలోని జుత్తిగ, పెనుమంట్ర, నత్తా రామేశ్వరం, పొలమూరు, ఆలమూరు, మార్టేరు, నెగ్గిపూడి తదితర గ్రామాల్లో శనివారం ఉదయాన్నే జోరువానలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటమి పార్టీ ఆధ్వర్యంలో పెన్షన్లను ప్రతీ ఒక్క లబ్ధిదారులకు అందించారు. జుత్తిగ గ్రామంలో స్థానిక నాయకులు వీరవల్లి సత్యనారాయణ, వీరవల్లి రాంబాబు, గొలుగూరి శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి వీరవల్లి ఇంద్రయ్య పాల్గొన్నారు.

మండలంలో మొదటిరోజు ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ శనివారం సాయంత్రం నాటికి 81.58 శాతం పూర్తి చేసినట్టు స్థానిక ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 8,356 మంది వివిధ పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, 6,817 మందికి పెన్షన్లు చేరాయని ఆమె పేర్కొన్నారు. మిగిలిన పెన్షన్లు సోమవారం అందిస్తామని ఆమె పేర్కొన్నారు

ఆచంట: మండలంలో ఎన్టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభించారు. శనివారం ఉదయం మండలంలోని కోడేరు గ్రామంలో ఆచంట నియోజకవర్గం ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. కాగా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఏకదాటిగా వర్షం కురుస్తున్నా తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తక్షణమే ప్రభుత్వం పునరాలోచించి ఉద్యోగస్తుల టైమింగ్స్లోనే పెన్షన్ పంపిణీ చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారుల అవసరాలను గుర్తించి శనివారం పెన్షన్ల పంపిణీని ప్రారంభించిందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని గ్రామాలలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందించారు. మొగల్తూరులోని పలు గ్రామాల్లో రామ్మోహన్ నాయుడు లబ్ధిదారులకు అందించారు. పాల రాంబాబు, బొల్లా చంటి, ఆదినారాయణ, పితాని శేఖర్ ఉన్నారు.

పెనుగొండ: మండలంలో పింఛన్ల పంపిణీ ముందుగానే అందించడంలో ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది కృషి చేశారని ఎంపిడిఒ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రభుత్వం సెలవు కావున పింఛన్ తీసుకోని వారిని సోమవారం అందిస్తామని తెలిపారు. శనివారం 5 గంటల వరకూ 8,200 మంది పింఛన్దారులకు రూ.3,39,39,000 పింఛన్ల సొమ్మును అందజేశామని, ఇంకనూ 614 మంది పింఛన్దారులకు అందించాల్సి ఉందని, రేపు ఆదివారం ప్రభుత్వ సెలవు కావున సోమవారం సాయంత్రానికి మిగిలిన 614 మంది పింఛనుదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా అందించాస్తామని తెలిపారు. మొదటిరోజు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసిన ఉద్యోగస్తులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు చేతుల మీదుగా కార్యకర్తలు అందించారు.

తణుకు: సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఉదయం 5.45 నిముషాలకే ఆరిమిల్లి తణుకు మండలం మండపాక, ఇరగవరం మండలం కావలిపురం, అత్తిలి మండలం పాలి, తణుకు పట్టణంలో 16వ వార్డులో భారీ వర్షంలో ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఆగష్టు 31న ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. 31న పెన్షన్లు తీసుకోని వారికి సెప్టెంబర్ 2వ తేదీన అందజేస్తారని తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

ధన్యజీవి అయ్యన్న

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ, నాయకులు

అర్థవరం గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేసిన చిన్నం అయ్యన్న ధన్యజీవి అని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం అర్థవరంలో జరిగిన అయ్యన్న సంతాప సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అయ్యన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంతాప సభలో పాల్గొన్న సిపిఎం గణపవరం మండల కమిటీ కార్యదర్శి పి.నరశింహమూర్తి మాట్లాడుతూ అయ్యన్న గ్రామ సర్పంచిగా గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరవలేనివని అన్నారు. అయ్యన్న కుమారుడు చిన్నంచిననాగేశ్వరావు మండల నాయకుడుగా, కెవిపిఎస్ మండల కార్యదర్శిగా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ మండల నాయకులు మేడిశెట్టి పెంటారావు, నరాలశెట్టి రామకృష్ణ, ఎస్.సంజీవీరావు మాట్లాడారు. చిన్నంచిననాగేశ్వరావు కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని ఆచంట నియోజకవర్గంలో నిర్వహించు ఐదు రోజుల వేడుకల్లో భాగంగా మూడవ రోజు శనివారం జనసేన నాయకులు చిట్టూరి అప్పారావు కుమారుడు చిట్టూరి రామకృష్ణ సౌజన్యంతో పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, ఉమ్మడి పగో జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ, వల్లూరు గ్రామ అధ్యక్షులు కడిమి ఉమా మహేశ్వరస్వామి, సేవే మార్గం - సేవే లక్ష్యం ట్రస్ట్ ఛైర్మన్ నల్లా రాధాకృష్ణ, జనసేన మండల కార్యదర్శి కాపవరపు రామకృష్ణ, చిట్టూరి రాంబాబు, మండల సెక్రెటరీ పంపన శ్రీనివాస్, తోట సాయిబాబా, నారిన రాంబాబు, రుద్రకాసు, అడపా హేమంత్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో జిల్లా జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణంలోని బాలికల సంక్షేమ హాస్టల్, బిసి బాలుర వసతి గృహాలను 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాల బాలికలకు అందించే భోజన వసతులపై ఆరా తీశారు. అనంతరం బాల బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై, రాజ్యాంగం గురించి వివరించారు. ఆయన వెంట ఫుడ్ సేఫ్టీ అధికారి, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలై చదవకుండా సంతోషంగా ఉన్నామని ఊహించుకుంటే జీవితమంతా కష్టాలు, శ్రమతో గడపాల్సి ఉంటుందని కెజిఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రాఘవ అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవ మాట్లాడుతూ భవిష్యత్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిన యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయని, యువత మాదక ద్రవ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మేఘన, దివ్యశ్రీ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా విద్యాశాఖ అధికారిణి నాగమణి

ప్రజాశక్తి - భీమవరం

పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో చేరేందుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి తెలిపారు. ఈమేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ పరీక్షకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు గమనించాలన్నారు. ఆసక్తి గల ఐదవ తరగతి విద్యార్థులు (%https://navodaya.gov.in%) ద్వారా ఆన్లైన్ చేసుకోవాలన్నారు. ఈనెల 16వ తేదీతో గడువు ముగుస్తుందని తెలిపారు. సెలక్షన్ టెస్ట్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరుటకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెన్షన్ల పంపిణీ వేళలు మార్చండి

ప్రభుత్వానికి విఆర్ఒల సంఘం వినతి

పెనుమంట్ర : వచ్చేనెల నుంచి ఎన్టిఆర్ భరోసా కింద వచ్చే అన్ని రకాల పెన్షన్స్ పంపిణీ వేళలు మార్చాలని రాష్ట్ర, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన నూతన ప్రభుత్వంలో గత 2 నెలల నుంచి వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, పెన్షన్ల పంపిణీ ఒకటో తేదీన ఉద్యోగులందరూ ఉదయం 5 గంటలకు పంపిణీ మొదలుపెట్టి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల ఒకటో తేదీ ఆదివారం సెలవు అయినందున ఉద్యోగులను సెలవు రోజున ఇబ్బంది పెట్టకూడదని ఈరోజు ముందుగా 31వ తేదీనే పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ కూడా శనివారం ఉదయం 5 గంటలకు భారీ వర్షాలు కురుస్తున్నా, ఎన్ని ఇబ్బందులు ఉన్నా పెన్షన్ల పంపిణీ ఎక్కువ శాతం దిగ్విజయంగా పూర్తిచేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే అందరు ఉద్యోగులు ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తున్నందున ముఖ్యమంత్రి ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇళ్ల తొలగింపు ఆలోచన మానుకోండి : సిపిఎం

ఆకివీడు : స్థానిక ఐభీమవరం రోడ్డులో కాలువ గట్టున ఉన్న సుమారు 80కుపైగా పేదల ఇళ్లను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని సిపిఎం ఆకివీడు పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సిపిఎం బృందం బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో చర్చించింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఈ రోడ్లో రోడ్ ప్రక్క పిడబ్ల్యుడి స్థలాల్లో నివసిస్తున్న పేదలందరూ ప్రస్తుత అధికారులు, ప్రజాప్రతినిధుల దుశ్చర్యలతో రోడ్డు పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ ఏ ఇబ్బందులు లేని విధంగా నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లను ఒక్కసారిగా తొలగించాలనే ఆలోచన నుంచి స్థానిక ఎంఎల్ఎ బయటకు రావాలని అన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా, కనీసం కాలవ్యవధి ఇవ్వకుండా ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలని హుకుం జారీ చేయడం సరికాదని అన్నారు. తక్షణమే ప్రస్తుతం కాలువ గట్టున నివసిస్తున్న బాధిత కుటుంబాలను గుర్తించి, వారికి రెండు సెంట్లు స్థలం మంజూరు చేయాలని, పట్టాలు ఇవ్వాలని, వారు ఇల్లు కట్టుకునే వరకు కాలవ్యవధి ఇవ్వాలని, ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న నాలుగు లక్షల సబ్సిడీని మంజూరు చేయాలని కోరారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా ఏకపక్షంగా ఇల్లు తొలగించాలనుకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు బివి.వర్మ, బి.రాంబాబు, సందకు సూరిబాబు, ఎస్కె.వలి పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి స్టార్టప్ కంపెనీలు దోహదం

శశి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఇస్మాయిల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులను పారిశ్రా మికవేత్తలుగా తీర్చిదిద్దడానికి స్టార్టప్ కంపెనీలు తోడ్పడతాయని శశి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఇస్మాయిల్ తెలిపారు. శనివారం శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 అవగాహన, ఇంక్యుబేషన్ స్టార్టప్ మీట్ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొని శశి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి అంగీకరించారన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన వివిధ సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాకథాన్ ప్రాముఖ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకార పథకాలను గురించి వివిధ సంస్థల నుంచి విచ్చేసిన వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో హైపర్బైట్, గో గ్రీన్ టెక్నాలజీస్, క్యారిషేర్, తేజస్ ఓపెన్ లాజిస్టిక్స్, స్వస్థ ఆర్గానిక్స్, న్యూట్రి రివైవ్, డ్రోన్ ఫ్యూజన్, బ్లూ ప్రింట్ ల్యాబ్స్, అస్వేల్ గ్యాలక్సి, కామ్యస్ బ్యూటీ అండ్ వెల్నెస్, అప్రౌధ, రికనెక్ట్ స్కిల్స్ మొదలగు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శశి ఇంక్యుబేషన్ సెల్ హెడ్ ఎం.పవన్కుమార్ రాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజల తరపున పోరాడే ప్రభుత్వం'

ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం ప్రజల తరుపున పోరాడే, పనిచేసే ప్రభుత్వం అని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల తర్వాత బయటకు వచ్చిన మాజీ మంత్రి కారుమూరి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని అన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు మంచి చేస్తే ప్రజలు వైసిపిని కేవలం 11 స్థానాలకే ఎందుకు పరిమితం చేశారని ప్రశ్నించారు. తణుకు నియోజకవర్గంలో బిసి అని చెప్పుకున్న మాజీ మంత్రి కారుమూరి కులాల మధ్య కుంపట్లు రాజేశారన్నారు. కనీసం 30 శాతం ఓట్లు కూడా సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలను ఏవిధంగా పీడించుకున్నారో, ఎలాంటి మాటలతో దుయ్యబట్టారో దానికి నిదర్శనమే వైసిపికి వచ్చిన ఫలితాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వినతులు స్వీకరిస్తుంటే వైసిపి వల్ల ఇబ్బందులు పడిన వారి వినతులే ఎక్కువ వస్తున్నాయన్నారు. అభివృద్ధి పక్కన పెట్టి కేవలం సంపాదనే ధ్యేయంగా కారుమూరి పని చేశారని విమర్శించారు. 80 రోజుల తర్వాత బయటకు వచ్చి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదని చెబుతున్నారని, గత ప్రభుత్వంలో నవరత్నాలు అని చెప్పి నవ మోసాలు చేసి ఎంతో మంది అర్హులు ఉన్నా పెన్షన్లు తొలగించారన్నారు. మీరు ఇచ్చిన హామీల్లో సంపూర్ణ మద్యం పాలసీ ఏమైందని ప్రశ్నించారు. రైతులను ఆదుకునే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. 3వ తేదీన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీలు అందజేస్తామని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని నాడు ఇచ్చిన హామీ ప్రకారం నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టి రద్దు చేస్తామని తెలిపారు. నాడు జగన్ వస్తే చెట్లను నరికేసి పరిస్థితి ఉండేదని, నేడు వన మహోత్సవం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ ఎఎంసి బసవ రామకృష్ణ, పితాని మోహనరావు, తణుకు మండల జనసేన అధ్యక్షులు చిక్కాల వేణు, వావిలాల సరళాదేవి పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

216 జాతీయ రహదారిని ఆనుకున్న డ్రెయినేజీ సమస్యవల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడతున్నారని, వర్షాలు కురుస్తుంటే వర్షం నీరు మొత్తం నిలిచిపోతుందని తక్షణమే జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి సమస్యని పరిష్కరించాలని కలెక్టర్ సి.నాగరాణికు నరసాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని వినతిపత్రాన్ని అందజేశారు. సమస్య పరిష్కరిస్తానని నాని కలెక్టర్ నాగరాణికి హామీ ఇచ్చారు.



కలెక్టర్కు వినతిని అందజేస్తున్న కొత్తపల్లి

CHANGE OF NAME

I. **ANNAPAREDDY KARUN KUMAR REDDY,** residing at D.No. 10-159\1, pedda Masidu Centre, Vuyyuru, Krishna District, Andhra Pradesh, Pin-521165. informs to the public that my spouse **GUNTAKA RAJESWARI** (Old Name) has officially Changed their name to **ANNAPAREDDY RAJESWARI** (New Name). all future references and Correspondence Should use the name **ANNAPAREDDY RAJESWARI** (New Name).

CHANGE OF NAME

I. **ANNAPAREDDY RAJESWARI,** W\o **ANNAPAREDDY KARUN KUMAR REDDY,** Previously called **GUNTAKA RAJESWARI** (Old Name) Resident of D.No. 10-159\1, pedda Masidu Centre, Vuyyuru, Krishna District, Andhra Pradesh, Pin-521165. now changed my name from **GUNTAKA RAJESWARI** (Old Name) to **ANNAPAREDDY RAJESWARI** (New Name). Today onwards use my new name for all Further transactions.

మహారాజ శ్రీ గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, కొత్తగూడెం
ఐ.పి. నెం. 11/2022

బిట్వీన్:
షేక్ ఖాదర్ వాలి ...వాది
మరియు:
మహమ్మద్ అబ్దుల్ సాహిద్ ...ప్రతివాది
To,
R-3: కరికాల వెంకట లక్ష్మి, C/o. నాగేశ్వర్ రావు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్,
R-4: కరికాల నాగలక్ష్మి, W/o. శ్రీనివాస రావు, వయస్సు: 35 సం//లు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్,
R-5: కరికాల శ్రీనివాస రావు, S/o. నాగేశ్వర్ రావు, వయస్సు: 40 సం//లు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్, పై ముగ్గురి నివాసము: ఇంటి నెం.23-183, పతే పేట, నూజివీడు, ఏలూరు జిల్లా.
R-6: షేక్ జహంగీర్, S/o. సర్దార్, వయస్సు: 48 సం//లు, వృత్తి: లారీ బిజినెస్,నివాసము: ఇంటి నెం.237, ఎంప్లాయర్స్ కాలనీ, వీధి నెం.922, నూజివీడు, ఏలూరు జిల్లా ...ప్రతివాదులు R3,R4,R5, R6.

నోటీస్

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! షేక్ ఖాదర్ వాలి అను వారు మీ పై వేసిన దివాళా దావా ఐ.పి.నెం.11/2022, **ది: 17-09-2024 నాడు ఉ.గం॥ 10:30 ని॥ లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై సమాధానము ఇవ్వని యెడల కోర్టు వారు కేసు మీకు పరోక్షములో తీర్మానము చెయ్యగలరని తెలియజేయుచున్నాము.

// కోర్టు వారి ఆర్డర్ ననుసరించి//
ఎస్.వి. రమణారెడ్డి, పగిడిపల్లి రవి,
వాదితరపు న్యాయవాదులు,
కొత్తగూడెం, సెల్: 9440116 171.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PALAKOL
O.S.No.25/2019

Between:
Indian Bank, Nationalized bank owned by Government of India, having its central office at 68, Rajaji Salai, Chennai, Branch all over India and Its Branch Indian Bank, Microsate, Palakol Rep.by Chief Manager, D.V.S.S.Ramanjaneyulu Power of Attorney holder ...Plaintiff/వాది
And
Pasupuleti Revathi and others ...Defendants/ప్రతివాదులు

To
పసుపులేటి రేవతి (1వ ప్రతివాది)
W/o.ఇస్సాకు, డోరునెం.42-2-52,
బేతలహంపేట, పాలకొల్లు.

పై నెంబరు దావా O.S.No.25/2019లో మీకు ఎన్నిసార్లు కోర్టు వారి ఉతర్వులు ద్వారా సమర్లు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున I.A.No.602/2023గా కోర్టు వారి అనుమతిపొంది ఈ ప్రకటన ద్వారా పై నెంబరు దావాలో మీరు ది 9.9.2024 న వ్యక్తిగతం గాను లేదా ప్లీడరు గారి ద్వారాను ఉదయం 10.30 గ॥లకు హాజరు కావలసినదని లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించటమగునని కోర్టు వారి ఉతర్వులు ప్రకారం మీకు తెలియపరుచుచున్నాము.
వాయిదా తేదీ 09-09-2024 సమయం ఉదయం 10-30

దశిక శేషగిరిరావు
పాలకొల్లు అడ్వకేటు, పాలకొల్లు
తేది.31-8-2024 Cell.9492918848

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు దివ్య సముఖమునకు
I.P.No.9/2024

Between:
యాతం దుర్గ మరియు మరొకరు ...పిటిషనర్లు
మరియు
ఆకుల శ్రీను మరియు వగైరా ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటిషనులో నా క్లయింట్లు యాతం దుర్గ మరియు యాతం సాయి గీతలు, ఆకుల శ్రీను వగైరాలపై రుణ ఎగవేత పిటిషనున్ను ది.29.4.2024 తేదీన దాఖలు చేయగా శ్రీకోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు నోటీసు అమలు నిమిత్తమై రిజిష్టర్డు పోస్టు ద్వారా మరియు కోర్టు ద్వారా అనేక పర్యాయములు సమను పంపినప్పటికిన్నీ మీరు తీసుకోనందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం సబ్స్టిట్యూట్ సర్వీసు నిమిత్తమై శ్రీకోర్టు వారు ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు వాయిదా తేదీని తెలియ పరచమని ఆర్డర్ వేసియున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా మేము మద్దాల వెంకటరత్నం అను మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషను I.P.No.9/2024 మీ యొక్క హాజరు నిమిత్తమై ది.19-09-2024 తేదీనకు వాయిదా కలదు. కావున సదరు తేదీన మీరు స్వయముగా కానీ లేక వకీలు ద్వారా కానీ ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

Palepu Venkata Satyanarayana
తాడేపల్లిగూడెం Advocate, Tadepalligudem
తేది.31-08-2024 Cell: 9963346059